


అర్సుకునేటోల్లు లేక సచ్చిపోయింది.

'గిప్పుడు తాగనీకి నీళ్లు లెవ్వు. ఆకలైతంది. కాళ్లు గూడ కాలుతానయి. నాకచ్చే కోపానికి తిట్టనీకి నా పెండ్లం గూడ లేదు. అది మంచాన వడ్డప్పుడు అర్సుకునుంటే.. నాకో తోడైనా ఉండేది. గిప్పుడు కుక్కసావ్ గావట్టే!' అని మనసుల తలుసుకున్నడు.

'నాకేం కమ్మి అయ్యే గనీ.. ఇద్దరు కొడుకులు, ఓ బిడ్డ ఉండే! పెద్ద కొడుక్కు సింగరేణి నౌకరు వెట్టించినంక పెండ్లాం పిలగాండ్లతోని పట్నంల వడ్డడు. మా దిక్కు మల్ల సూపు ఐనా లేదు. అవ్వ సచ్చినప్పుడు సుత రాలే. శిన్నోడేమో.. 'పెద్దోనికి పని వెట్టిచ్చినవ్. నేను కొడుకును కాదా?' అని ఇల్లు ఆని పేరట రాపిచ్చుకుని.. దాన్ని ఎవ నికో అమ్ముకున్నడు. నా పించిని పైసలువడే బేంకు అకోంటు ఏటీఎం కారట తీస్కోని.. దేన్నో వట్టుకొని బైటవడ్డడు. జాడ లేదు – పత్త లేదు. కులంగాని దాన్ని వట్టుకవోయిండని మా కులపోల్లు మమ్మల్ని ఎలేశిన్రు.

గందుకే.. బిడ్డ లగ్గం జేసుడుకు పిలగాడు దొరుకక సావు కట్టమైంది. ఎట్లనోగట్ల ఉన్న పొలం ఆయింత అమ్మి దాని లగ్గం ఘనంగా జేశి సాగనంపితే.. నా ఇంటి కత్తే విలువ తక్కువనీ తొలిసూరు కాన్పుకైనా రాలే.

ఏం జేయలేక తాగితాగి ఇంటికివోయి ముసల్దాన్ని కొట్టుడు. అది పొద్దంతా కైకిలికి వోయచ్చి, నాకు బువ్వ కూర అండివెట్టేది. నేను పనుగడ లేక తాగి తిరిగినా కూడా.. అది నన్ను ఎంత మంచిగా అర్సుకున్నది ఉన్నన్ని రోజులూ..!? నేనేమిచ్చిన దానికి? సచ్చిపోయే దాంక నరకం తప్ప!'.. తాగనీకి నీళ్లు లేవు గానీ.. గివన్ని యాదికచ్చి పెంటనికి కండ్లల్ల దూపనువెంచె నీళ్లు అచ్చినయ్.

ఎవరినైన కొన్ని నీళ్లు అడుగుదామన్నా.. కులం ఎలేశినోడాయే. నీళ్ల కోసం అటూఇటూ దేవులాడిండు. గప్పటి దాంక ఎంబటే నడుసుకుంటస్తున్న కుక్క ఒకటి.. పెంటని గోశిని పిలుస్తున్నట్టు లాగి, ఎక్కడికో దారి సూపి స్తున్నట్టు ముంగటకు నడిశింది. పెంటడు సుత దాని ఎన కనే వోయిండు. కుక్క బోర్ పంపు కాడికి తీస్కపోయింది.

'దీనికెంత ఇస్వాసం!? ఎప్పుడో ఓసారి నా గుడిశె ముంగటకచ్చి మొత్తు కుంటే గింతంత పాశివోయిన సలి బువ్వ ఏశి నందుకు. నేను కన్నోల్లకు సుత లేకపాయె ఇండ్ల సగం ప్రేమ గూడ'..

అనుకుంట వొయ్యి బోర్ పంపు కటుక ఒత్తిండు. నీళ్లు రాలే. కరెంటు లేనట్టుంది.. ఎండకాలం గదా. గీ కరెంటు మోటార్లువెట్టి శేతి పంపు లేకుండా జేశిన్రు. గదుంటే రెండు దెబ్బలు అటుఇటు అనంగనే నీళ్లు అచ్చే టివి. గిప్పుడు కరెంట్ లేంది రావాయే.

దూప ఐతంది. కాళ్లు కాలుతానయి. ఎండ శిట్టశిట్ట కొడుతాంది. ఓసర లేక బోరుపంపు గద్దె మీద కూలవ డ్డడు. గట్ల ఎంతసేపయ్యిందో గానీ.. శేతుల వట్టుకున్న రేషన్ కారట, సంచి జారి కిందవడ్డయి. నిద్రల నుంచి లేశి సూస్కుని..

'మల్ల డీలర్ రేషన్ దుకాణం బంజేషి పోతడు' అను కుంట దబదబ లేశి మల్ల తొవ్వవట్టిండు.

'నా కారట మీద మొన్ననే బియ్యం పోశిండు. ఇప్పుడు పోస్తడో, పొయ్యడో? కొన్నయిన ఉంచుకుంటే అయిపోవు. కిలకు పది రూపాలు అత్తానయని, బియ్యంకొనే ఆటోవోనికి అమ్మి, తాగుడుకు ఒడగొడితి. పైసలు గూడా లెవ్వు నా కాడ! కాళ్లయినా మొక్కి బియ్యం తెచ్చుకోవాలె. లేకుంటే మాపటీలి బువ్వకు ఒక ఇత్తు గూడ లేదు!'..

సోంచాయింపుల రేషన్ దుకాణం అచ్చింది. ఎపుడ చ్చిందో తెల్వది గానీ.. కుక్క కూడా ఎనకనే ఉన్నది.

మెల్లగా బుగులు వడుకుంటనే లోపలికివోయి అటూ ఇటూ సూశిండు. బియ్యం బస్తాలు ఐతే ఇగ్గనే ఉన్నయి. కొంచెం మదిల నిమ్మలం అయ్యింది పెంటనికి. కాంటల బియ్యం జోకుతండు డీలర్. ఐదారుగురు లైన్ల ఉన్నరు. అండ్ల ఆరు నెలల ముంగట పెంటనికి అప్పు